"పల్లవీ!....ఏంటలా వున్నావు?" వాచిన కళ్ళు. చెదిరిన తల, మ్లాన వదనంతో, తల వంచుకుని కూర్చున్న పల్లవి వైపు చూస్తూ, ఆప్యాయంగా అడిగింది వీణ టీచర్ పావని.

"మేడమ్...!", ఏదో చెప్పబోతూ, తటపటాయిస్తున్న పల్లవితో—

"చెప్పమ్మా! ఎందుకలా వున్నావు?"

"మేడమ్! నేనిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనండి! సంగీతంలో డిప్లమా తీసుకుని, మంచిపేరు సంపాదించుకుని....అయినా, నాకిప్పుడే పెళ్ళేంటండీ!"

"ఏం, ఎవరైనా చూడ్డానికి వచ్చారా?"

"అవునండీ! మొన్న లక్ష్మీవారం, మీరు కచేరీ కోసంగా, విజయవాడ వెళ్ళారు. మీకీ విషయం తెలియదు. 'అమ్మాయి కాస్త నలుపయినా, మీరెక్కువ ఇవ్వగలిగే స్థితిలో లేకున్నా, మా అబ్బాయికి, మీ అమ్మాయి నచ్చింది కాబట్టి, ఐదు వేలు, లాంఛనాలు ఇస్తాం. అసలు, మా అబ్బాయికి ఇరవై, ముప్పయివేలిస్తామని కూడా వస్తున్నారు' అన్నారట. నాన్న అన్నింటికీ ఒప్పుకున్నారు. మరి, మరి, నాన్న.... మీకు తెల్సుగా! కేవలం, గుమాస్తాగిరి, ఏ ఆస్తీ, కనీసం, సొంత ఇల్లు కూడా లేని నాన్న, ఒక్క ఆడపిల్లనైనంత మాత్రాన, నా తరవాత ఇద్దరు తమ్ముళ్ళు లేరూ? ఇంత డబ్బు ఖర్చుపెట్టి లాంఛనాలతో ఎలా చేస్తానని నాన్న ఉద్దేశ్యం? మేడమ్! మీరు చెప్పరూ, ఇంటర్ రిజల్ట్స్ ఇవాళో, రేపో వస్తాయి. సంగీతంలో కూడా డిప్లమా తీసుకుని, ఏదేనా ఉద్యోగం కొరకు ప్రయత్నిస్తే....ప్లీజ్ మేడమ్! నాన్నకు చెప్పరూ?" బేలగా, అమాయకంగా అడిగింది పల్లవి.


"సరే! నే మాటాడతానులే, పిచ్చిపిల్లా, ఈ మాత్రానికే, అంతలా ఏడ్చావా? ఆ మొహమేంటి? ఆ కళ్ళేంటి? అయినా, నీకు ఆలోచన లెక్కువ" అంటూ, ఆప్యాయంగా మందలించింది పావని. ఆ మాత్రం ధైర్యానికే, ఆ అమ్మాయి కళ్ళు సంతోషంగా, తృప్తిగా మెరిశాయి. వీణ వాయిస్తున్న పల్లవిలో, ఆనాటి ఇరవై సంవత్సరాల పడుచు "పావని" .... కన్పించి, ఆమె కళ్ళూ చెమ్మగిల్లాయి. తనకూ, పది, పన్నెండేళ్ళ క్రిందట, ఇదే పరిస్థితి. కాలం మారింది, మనుష్యులు మారారు — అంటారు. ఊహుఁ. ఎక్కడా? ఇంకా, ఈ వివాహ సమస్య రోజురోజుకి ఊపిరి పోసుకుని, బ్రహ్మరాక్షసిలా, తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటూ ముఖ్యంగా, మధ్య తరగతివారి గుండెలలో కూర్చుని వికటాట్టహాసం చేస్తూంది, భయంకరంగా!

"మాష్టారూ! నాన్నతో చెప్పరూ? వున్న ఒక్క యిల్లు అమ్మి, నా పెళ్ళి చేస్తే చెల్లి బ్రతుకేం కావాలి? 'ఆస్తమా'తో బాధపడ్తున్న నాన్న, ఇంకా ఎన్నాళ్ళని బడిపంతులుగా, కష్టపడతారు? రోజు, రోజుకూ చిక్కిపోతున్నారు. నాన్నకు చెప్పరూ, ఇల్లు, అమ్మవద్దని" బేలగా ప్రార్థిస్తున్నది పావని....అలా ఆమె గతస్మృతుల లోనికి అడుగు పెడుతూ వుండగా—

"మేడమ్! "పూర్వకల్యాణి" కీర్తన, మొదలు పెడ్తానన్నారీరోజు" అన్న పల్లవి మాటలకు, ఈ లోకంలోకి వచ్చి, ఆలోచనలను, బలవంతంగానే ప్రక్కకు నెట్టి, "జ్ఞానమొసగరాదా ...." వాయించింది. మనసంతా చికాకుగా, వీణ కూడా అపశృతులు పలికినట్టుగా భావన. పల్లవి మాత్రం చెప్పి, అనుపల్లవి, చరణం, తర్వాత చెప్తానంటూ, ఆలోచనలలోనికి జారిపోయిన మేడమ్, ఎప్పటికీ, అర్థం కాదు, పల్లవికి. ఉత్సాహంగా, మాట్లాడ్తూ, మాట్లాడ్తూనే, హఠాత్తుగా, ఏదో ఆలోచనలలోకి జారిపోతున్నట్టుగా, ఎదుటి మనుష్యులను కూడా, గమనించనంత పరధ్యానావస్థ, శూన్యంలోకి పిచ్చిగా చూసే పావని—అందానికి అందం, విద్యార్థులందరికి ప్రియమైన టీచర్‌గా....అన్నీ వున్న మేడమ్‌కు ఏం తక్కువైందని, అలా విచారంగా వుంటుంది? ఆ కళ్ళెప్పుడూ, విషాదాన్ని కురిపిస్తుంటాయేం? ఏ, బాదరబందీ లేక, పెళ్ళి చేసుకుని, మగవాడి చేతి క్రింది నీళ్ళు తాగే అవసరం లేకుండా, స్వేచ్ఛగా, ఆమె ఆశయాలకనుగుణంగా....ప్చ్! మేడమ్ లాటి జీవితం.... తనకూ...అలాగే....

*

ఆ రాత్రి, నిదురకు దూరమయిన పావని,



# ఓడిపోయాను

చింతపల్లి సునీత

చుట్టుముడ్తున్న స్మృతులనుండి తప్పించుకోడానికి వీణ తీసి, వాయిస్తూ కూర్చుంది. మృదు మధురమైన ఆ గానానికి, ఆమె గుండెల నిండా ఆవరించిన గుబులునూ, దీర్ఘమైన చీకటిలా భయపెడ్తున్న ఒంటరితనాన్నీ పారద్రోలే శక్తి వుంది. నిదురరానివారు కూడా, ఆ వీణా నాదాన్ని వింటే, మత్తుగా నిదరపోతారు. పరిసరాలు విస్మరించి, తన్మయంతో వీణ వాయిస్తూ కూర్చున్న పావని, తలుపు చప్పుడవడంతో, వులికిపాటుగా లేచింది. 'ఇంత రాత్రి వేళ వచ్చిందెవరై వుంటారు' కనుబొమలు ముడుచుకుని, ఆలోచిస్తూ నిల్చున్న పావనికి పరిచయమైన కంఠం వినిపించి, చప్పున తలుపు తెరిచింది.

"మేడమ్....!" భోరున ఏడుస్తూ, తనని చుట్టేసిన పల్లవిని అయోమయంగా చూస్తూ, భుజాలచుట్టూ చేయి వేసి లోపలకు నడిపించుకుని వచ్చింది పావని.

"మేడమ్....నాన్న....నాన్నని...."

"ఏంటి, పల్లవీ!....నాన్నగారికేమైం దమ్మా?"

"మేడమ్! నాన్న ఉద్యోగం" చెప్పలేక విపరీతంగా ఏడుస్తూ వెక్కుతున్న పల్లవిని ఆప్యాయంగా దగ్గరగా కూర్చోబెట్టుకుంటూ "నాన్న ఉద్యోగం....ఏంటమ్మా సరిగ్గా చెప్పు?"

"మేడమ్!.....ఇదంతా నావల్లే; నా పెళ్ళి కొరకు; కట్నం డబ్బుకొరకు అవినీతిగా డబ్బు ఆర్జించడం అంటే అసహ్యించుకునే నాన్న కలలో కూడా పాపపు చింతన తలపెట్టని నాన్న 'లంచం' అనే వ్యసనానికి బానిసలయిన వారిని హీనంగా చూచి ఏవగించుకునే నాన్న— తన ఆదర్శాలకు విరుద్ధంగా, ఈ అవినీతికి పాల్పడ్డారు! పట్టుపడ్డారు! ఈ అనర్థాలన్నిటికీ కారణం, నేను....నేను...." దుఃఖంతో, మంచం కోడుకేసి, తల బాదుకుంటున్న పల్లవిని, గట్టిగా పట్టుకుంటూ, "పల్లవీ! ఏంటీ, ఆవేశం...." అన్నది పావని.

"ఆవేశమా?....మేడమ్!....డబ్బు లేకున్నా వున్నంతలో పరువుగా బ్రతుకుతున్న మేము. నీతికీ, నిజాయితీకీ, మకుటం లేని రాజుగా, ధర్మరాజుగా పేరు తెచ్చుకున్న నాన్న, 'లంచగొండి! ఉద్యోగం పోయింది, ఎన్నాళ్ళనుండి ఈ వ్యవహారం సాగుతూందో ఇప్పటికి బయట పడ్డాడు, లంచగొండి...లంచగొండి" ఈటెల్లాంటి మాటలు సూటిగా గుండెలను తాకుతుంటే సజీవ దహనమైపోతున్నవానివలె వున్నారు నాన్న! చెప్పండి మేడమ్....నాది ఆవేశమా....మేడమ్! ఇంటర్ రిజల్ట్సు రాగానే నాకేదైనా ఉద్యోగం చూడరూ ఎంత చిన్నదైనా సరే!....నేనూ మీలాగే ఉద్యోగం చేసి నాన్ననీ, అమ్మనీ, తమ్ముళ్ళనీ...."

"పల్లవీ! నీవు ఆవేశపడొద్దు. నేను ఆఫీసులో కనుక్కుంటాను – అసలేం జరిగిందో! నీవే ఇలా ఏడిస్తే, అమ్మా, నాన్నా, ఎంత కుమిలిపోతారు? నీ చిన్న తమ్ముళ్ళు ఎంత బెంబేలు పడతారో ఆలోచించు. ఏడ్చినందువల్లా, ఆవేశ పడినందువల్లా, ఏ పనులూ నెరవేరవు.

నీవంటావుగా ఎప్పుడూ! 'మేడమ్! మీలాగే పెళ్ళిచేసుకోకుండా, మీలాగే ఉద్యోగం చేస్తూ, నా వారిని పోషిస్తూ, స్వేచ్ఛగా జీవిస్తాను' అని. వద్దు పల్లవీ, వద్దు నీ పావని మేడమ్ లాటి జీవితాన్ని నీవు కలలో కూడా కోరవద్దు. నీకేం తెలీదు. నీవు చాలా చిన్నపిల్లవి. "దూరపు కొండలు నునుపు" అన్నే నానుడికి ఉదాహరణ నా జీవితం. నీ మేడమ్ కథ వినాలని వుందా?"

పావని మనసు, చేదుగా గడిచిన గతంలోకి తొంగి చూచింది.

*

"ఏం తల్లీ! నిన్న రాలేదేం?" ఆప్యాయంగా అడిగారు మాష్టారు, ఎండలో నడిచి వచ్చినందువల్ల, బడలికతో, చిరుచెమట పట్టిన మొహాన్ని, మెడనీ, కొంగుతో వత్తుకుంటూ, చిన్నగా నవ్వింది పావని. ఆ నవ్వులో కావలసినంత విరక్తి, ఎన్నో అర్థాలు, ఎన్నో సందేశాలు.

"మామూలే మాష్టారూ, పెళ్ళిచూపులు"

"చాలా సంతోషం తల్లీ! అబ్బాయి బావున్నాడా?"

"నేను తలెత్తి చూస్తేగా, అయినా..."

"మీ నాన్నగారు చెప్పారు కదమ్మా! రంగాపురం సంబంధం వాళ్ళకి, నీవు నచ్చావనీ, జాతకాలు కూడా భేషుగ్గా కుదిరాయనీ, మళ్ళీ నిన్న.."

"మాష్టారూ! నచ్చాననండీ!....ఇద్దరికీనూ" పెదవులపై, హేళనతో కూడిన నవ్వు. "నచ్చినంత మాత్రాన....పిచ్చినాన్న నేనేదో పేద్ద అందగత్తెనని, నవలల్లోలా, ఎవరో అందగాడు, స్థితి మంతుడు, నన్ను కోరి, మెచ్చి, కట్నం లేకుండా వివాహం చేసుకుంటున్నట్టు కలలు కంటారు. అబ్బాయికి నచ్చినంత మాత్రాన "మిగతావి" అన్నీ నచ్చాలిగా." నిర్లిప్తంగా, కొద్దిగా ఆవేశంగా మాట్లాడ్తున్న అందమైన పావని మొహం ఎర్రబడింది.

"పిచ్చిపిల్లా, నీకేం తల్లీ! అదృష్టవంతురాలివి. సరస్వతిని స్వంతం చేసుకున్నావు. లక్ష్మికళ నీలో వుంది. అసలు, వాళ్ళు నిన్ను ఒప్పుకోలేదంటే, తుచ్ఛమైన కట్నం కోసం, వాళ్ళు వెనుకాడారంటే, అది వాళ్ళ దురదృష్టం. నీ దెంత మాత్రం కాదు. నాకు తెలుసు, నీలాంటి సద్గుణవంతురాలికి మంచి వరుడు లభిస్తాడని. ఆ కళ నీలో వుంది." జ్యోతిష్యంలా చెప్తున్న మాష్టారి మాటలకు సన్నగా నవ్వుతూ, వీణ శృతి చేస్తున్న పావని హఠాత్తుగా, "మాష్టారూ! మీరు నాన్నతో చెప్పరూ! నా పెళ్ళికోసంగా ఇల్లు అమ్ముతారట. పెద్దక్క పెళ్ళికి పొలం తాకట్టు పెట్టి అది విడిపించుకునే శక్తిలేక అసలు కంటే, వడ్డీ ఎక్కువై దానికీ దానికీ సరిపోయింది. మళ్ళీ, నా కొరకు ఇల్లు-మరి చెల్లి?....దాని నోట్లో మట్టేగా! ఒకవేళ అమ్ముదామన్నా ఏది వుండదు. నాన్న కిష్టమైన ఆ యిల్లు, అమ్మ మసలిన ఆ యిల్లు, మా కష్ట సుఖాలను కడుపులో దాచుకున్న ఆ ఇల్లు అమ్మి నా పెళ్ళి చేస్తే, నేను సుఖంగా శాంతిగా కాపురం చేయగలనా? నా పెళ్ళికిప్పుడేం తొందర లేదు. ఇల్లు అమ్మ వద్దని నాన్నకు చెప్పరూ!" బేలగా అర్థించింది పావని.

"పావని తల్లీ! ఈ ప్రపంచంలో మన ఇష్టాను

సారంగానే, మనం అనుకున్నవన్నీ సమకూరుతాయా! ఏదెలా జరగాలని వ్రాసిపెట్టుంటే అలానే జరుగుతుంది. ఈ విషయంలో నీవు కల్పించుకుని మనసు పాడుచేసుకోవద్దు. ఏది జరిగినా, అంతా మన మంచికే అనుకుంటే మంచిది. సాయంకాలం నేనటువైపు వస్తానులే'' ఓదార్చారు రాఘవయ్య మాష్టారుగారు.

వీణ,గాత్ర సంగీత విద్వాంసులు రాఘవయ్యగారి దగ్గర వీణ, గాత్రసంగీతాలు అభ్యసించి, సంగీత పరీక్షలలో, పస్టుక్లాసు సర్టిఫికెట్ తీసుకుంది. ప్రాక్టికల్‌తోపాటు, థియరీలోకూడా మంచి పరిజ్ఞానం వుంది పావనికి. వీణ వాయించడంలో శ్రద్ధ, భక్తి, మెలకువలతో తను చెప్పేది శ్రద్ధగా ఆలకించి, వెంటనే వాయించి చూపించే పావని అంటే, మిగతా, శిష్యులందరికంటె ప్రత్యేకమైన అభిమానం, ప్రేమ మాష్టారికి.

''పావనీ, తల్లీ! అత్తగారింటికి వెళ్ళిన తరవాత నీ ఈ మాష్టారు గుర్తుంటారా లేక మర్చిపోతావా!" పసి పిల్లాడిలా అడుగుతుంటారు ఆయన. ఘోటక బ్రహ్మచారి, అరవై ఏళ్ళ మాష్టారిలో భగవంతుడిని చూసుకుంటుంది పావని.

*

గౌరవనీయులైన మాష్టారుగారికి,

పాదాభివందనములు.

మాష్టారూ!....నేను హైదరాబాదు వెళ్ళుతున్నాను. ఎందుకంటారా? నిన్న షావుకారు వచ్చారు. వారు మా యిల్లు కొనటానికి సుముఖంగా వున్నట్టు ఏవేవో వారి మాటలవల్ల తెల్సింది. నేనెంత చెప్పినా నాన్న వినలేదు. చూశారా! మీరు చెప్పినా వినలేదు. ఎందుకంత పట్టుదల నాన్నకి? ఇల్లు అమ్మి అయినా సరే, వారు కోరినంత కట్నం ఇచ్చి, పెళ్ళి చేయాలన్న తొందరెందుకు? నాన్నకి అత్యంత ప్రియమైన ఆ యిల్లు నా కొరకు...నా కొరకు అమ్ముతున్నారంటే నేను సహించలేను. 'ఆస్తమా'తో భాదపడుతున్న నాన్ననీ అమాయకురాలయిన చెల్లినీ, వారి కర్మానికి వాళ్ళనొదిలి పెళ్ళిచేసుకుని నేను హాయిగా వుండగలననా నాన్న ఉద్దేశ్యం? మాష్టారూ! రంగాపురం సంబంధం వాళ్ళ షరతులేంటో తెల్సాండి? 'అమ్మాయికి సంగీతమంటే ప్రాణం అంటున్నారు. కానీ, మా ఇంటికి వచ్చాక ఈ సంగీతం, వీణ ప్రక్కకు పెట్టాల్సి వుంటుంది. మాది నిప్పులాటి వంశం. పాటలూ, కచ్చేరీలు మా యింటా వంటా లేవు' అని ఖచ్చితంగా చెప్పారు. మీకు తెల్సుగా! 'సంగీతం'పై నాకున్న గౌరవం! ఈ పెళ్ళి చూపులతో చాలా విసిగి పోయానండీ, నామీద నాకు అసహ్యం కూడా వేస్తోంది. హైద్రాబాదులో నా స్నేహితురాలు విమల భర్త, ఒక మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపాల్. నాకు ఉద్యోగం కొరకు ప్రయత్నం చేస్తానన్నారు. ఒకవేళ ఉద్యోగం దొరకకున్నా నాకున్న కళను నలుగురికీ నేర్పితే, నా జీవితం నాన్న, చెల్లెలి జీవితం గడవకపోదు. మీరు నేర్పిన విద్యను సార్థక పరచుకుంటాను. ఆడది ఒంటరిగా స్వశక్తితో ఎందుకు బ్రతకలేదో చూపిస్తాను. 'పెళ్ళే' ఒక పరమావధిగా, దానికొరకు ఇలా ఎదురు చూస్తూ కుర్చోవాలంటేనే అసహ్యం వేస్తుంది – మాష్టారూ! పెళ్ళికాకున్నా నాకు చింతలేదు. హాయిగా చెల్లిని చదివించి మంచి వరుడిని చూసి పెళ్ళి చేస్తాను. తర్వాత నాన్న నీడలో హాయిగా వుంటాను. నా ప్రాణం పోయినా ఆ యిల్లు అమ్మనివ్వను. పెళ్ళి కాకుండా ఎంత హాయిగా సుఖంగా బ్రతకగలనో నిరూపిస్తాను. ''పావనీ! నీ నిర్ణయాన్ని నాన్నగారు ఆమోదించరు'' అని అంటున్నారు కదూ! మాష్టారూ! మీకు తెల్సా! ఆరువేల కట్నం, ఒక ఎకరం పొలం, పసుపు కుంకుమ క్రింద అన్ని లాంఛనాలతో అతివైభవంగా నోట్లో నాలుకలేని అక్క వివాహం జరిపించితే, వున్న ఎకరం పొలం పెళ్ళయిన ఏడాదికే స్వాహా చేశారు వాళ్ళు. పైగా 'ఇంక నీవు పుట్టింటి నుండి ఏమీ తీసుకురావు. ని వాళ్ళంతా దరిద్రులు' అని ఈసడిస్తారట. ఇప్పుడు చెప్పండి, అంత కట్నం తీసుకుపోయి అక్క ఏ మాత్రం సుఖపడ్తూందో!....అందుకే, అందుకే మాష్టారూ! ఈ పెళ్ళి వ్యవస్థ అంటేనే నాకు అసహ్యం, అసహ్యం అని ఎలుగెత్తి పలుమార్లు అరవాలనిపిస్తుంది. 'ముగ్గురూ ఆడపిల్లలే' అని బాధపడ్తున్న అమ్మతో, ''ఎందుకే అలా నా చిట్టి తల్లులకు దిష్టిపెడతావు? లక్ష్మి, పార్వతి, సరస్వతులు నా తల్లులు. అందంగా బంగారు తల్లుల్లా వున్నారు. కళ్ళకద్దుకుని చేసుకుంటారు. ముగ్గురు అమ్మాయిల పెళ్ళి ఎలా చేయాలో నన్న దిగులు నీకనవసరం'' గర్వంగా మాట్లాడిన నాన్న మాటలు నాకిప్పటికీ జ్ఞాపకం. అమ్మ హఠాన్మరణంతో నాన్న పూర్తిగా కృంగిపోయారు. 'నివురుగప్పిన నిప్పు'వలె దాక్కున్న 'ఆస్తమా' విజృంభించింది. పిల్లలకు పాఠాలు కూడా, సరిగ్గా చెప్పలేకపోతున్నారు. రాత్రిళ్ళు పైకప్పుకేసి చూస్తూ, ఆలోచనలలో మునిగిపోతున్న నాన్నను చూస్తుంటే నా గుండె తరుక్కుపోతుంది. అందుకే మాష్టారూ! నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మీరు మాత్రం, 'నామాట వినలేదు పావని' అని, నాపై కినుక వహించరుగా! నాకు తెల్సు! ఈ ప్రపంచంలో, నాన్నకంటే కూడా నా మనసుని అర్థం చేసుకునే వారు మీరొక్కరేనని! కాని–మీ జ్యోతిష్యం, మీ నమ్మకం వమ్మయింది. 'ఏంటీ?' అంటున్నారా, తరచూ అనేవారుగా 'అపర సరస్వతివి, లక్ష్మి కళ నీలో వుంది. మంచి యోగ్యుడు నిన్ను వెతుక్కుంటూ వచ్చి, కోరి నిన్ను వరిస్తాడమ్మా' అని. మరి.... మరి ....'లక్ష్మీకళ' ఉన్నంత మాత్రాన ....'లక్ష్మి'....'డబ్బు'.... డబ్బు వుండద్దూ!....మరి, అందంగా వున్నంత మాత్రాన కట్నం లేకుండా చేసుకోవడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదేం? మీకు ఇప్పటికైనా తెల్సిందా దీనికంతకూ మూలకారణం డబ్బు! మాష్టారూ! నా జీవితంలో మధురమైన, మరపురాని సంఘటనేదైనా వుందంటే, అది మీ శిష్యురాలిగా నేను నేర్చిన విద్య. దానితోపాటు మీరందించిన ఎనలేని ఆత్మీయత, ఆప్యాయతలను నేనీ జన్మలో మర్చిపోగలనా!....మీ విద్యనంతా నాకు నేర్పారు, మీకే గురుదక్షిణ ఇవ్వలేని అశక్తురాలిని. నేనిలా వ్రాస్తే, మీకు కోపం వస్తుందని తెలుసు. నేను, నావెంట మీరుబహూకరించిన 'వీణ'ని తీసుకెళ్తున్నాను. నేనిలా వెళ్తున్న విషయం నాన్నగారికి నిదానంగా చెప్పండి, ధైర్యం చెప్పండి. నేనిలా ఉద్యోగం కొరకు వెళ్ళడం, నాన్నకు సుతరామూ ఇష్టం లేదు. అందుకే చెప్పకుండానే వెళ్తున్నాను. అక్కడికెళ్ళాక, అన్నీ వివరములతో జాబు వ్రాస్తాను. ముఖా ముఖంగానే మీకిదంతా చెప్పి, మీ ఆశీర్వాదాన్ని తీసుకునే వెళ్ళాలన్న నా అభిలాషని, బలవంతంగా అణచుకున్నాను. అందుకే, మీకీ లేఖ వ్రాస్తున్నాను. మీ ఆశీర్వాదం, శ్రీరామరక్షవలె నన్ను చల్లగా సదా కాపాడుతుందన్న నమ్మకం వుంది.

ఇంక సెలవు తీసుకుంటాను.

మీ శిష్యురాలు

పావని

మాష్టారికి మాత్రం జాబు వ్రాసి, తను హైదరాబాదు వచ్చింది. తనని స్నేహితురాలు, ఆమె భర్త ఆదరించడం, ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడం, వీణ అధ్యాపకురాలిగా, తనూహించని విధంగా కాలేజీలో ఆర్డర్స్ రావడం, అంతా కలలోలా త్వర త్వరగానే జరిగిపోయాయి. తన స్నేహితురాలు విమల, దాని భర్తకు ఎన్ని కృతజ్ఞతలు తెలుపుకుందో! నాన్నకి, మాష్టారికి సంతోషంగా జాబులు వ్రాసింది. తనే సెలవపెట్టి ఊరికివెళ్ళి బ్రతిమాలుకుని అయినా సరే నాన్నని, చెల్లినీ తీసుకొద్దామనుకుంటే, అప్పుడే కొత్తగా జాయినయి, వెంటనే సెలవుపెడితే బావుండదని వెళ్ళలేకపోయింది. తనకి త్వరలోనే మంచి పేరు, పెద్దల ప్రశంసలూ లభించాయి—క్లాస్‌లో పాఠం చక్కగా చెబుతుందని, కోయిల కంఠం అనీ. ఆ పేరూ, ప్రఖ్యాతులు రావడానికి కారణం విమల, విష్ణువర్ధన్‌గారు. తన పాటంటే, అతను చెవి కోసుకుంటాడు. మాష్టారి తర్వాత అతనినే పూజనీయమైన వ్యక్తిగా తలంచి, తన అభివృద్ధికి కారకులవుతున్న ఆ దంపతులకు తనే మిచ్చి ఋణం తీర్చుకోవాలో, తెలిసేది కాదు తనకు. అబ్బ!....తన సమస్యలన్నీ తీరినట్టే, నాన్నకి మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించాలి. చెల్లిని బాగా చదివించాలి. ముఖ్యంగా, తన యిల్లు, నాన్న కిష్టమయిన ఇల్లు అమ్మక్కర్లేదు. నిజంగా మాష్టారన్నట్టు, తను చాలా అదృష్టవంతురాలు. లేకుంటే ఇంత మంచి ఉద్యోగం ఇంత త్వరలో తనకు వచ్చిందంటే....తన అదృష్టం కాక మరేంటి? నిదానంగా నాన్నకి తన నిర్ణయాలుచెప్పి, ఒప్పుకునేలా చేయాలి. భవిష్యత్తంతా అందంగా కన్పిస్తుంటే సంతోషంతో పొంగిపోయింది పావని. అన్నీ సవ్యంగా, మనం అనుకున్నట్టే జరిగితే జీవితమే లేదన్నట్టుగా-దురదృష్టదేవత ప్రక్కనే పొంచి, తన జీవితంలోకి ప్రవేశిస్తుందని తను కలలో కూడా ఊహించలేదు. తన ప్రాణస్నేహితురాలు, తనని ఆదరించి, తనకొక మంచిదారిని, బ్రతుకుతెరువును చూపించిన విమల తనని అనుమానించింది. ఆమె భర్త విష్ణువర్ధన్‌కి, తనకూ సంబంధం అంటగట్టి ప్రచారం చేయడంతో, త్వరలోనే తనకు చెడ్డ పేరు రావడం, ఈ నీచమైన ప్రచారంవల్ల, తనకు అనుకోని కష్టాలు, తోటి లెక్చరర్ల వ్యంగ్యమైన విసుర్లు, విషపు చూపులు, హేళనతో కూడిన గుసగుసలు, పుండు మీద కారం చల్లినట్టుగా, అప్పుడే తన ఊరికి కూడా వ్యాపించిన ఈ ప్రచారం, 'నీవు ఇంట్లో నుండి నాకు చెప్పకుండా వెళ్ళిపోయినప్పుడే నీవు లేవనుకున్నాను. నిప్పులతో చేతులు కడుక్కునే వంశం మనది. మళ్ళీ నీవు వచ్చి, నా గుండెల్లో చిచ్చు రేపి, చిన్నది పార్వతి జీవితాన్ని కూడా నాశనం చేయకు.' నాన్నగారి కఠోరమైన లేఖ – తన జీవితాన్నే తారుమారు చేశాయి. స్నేహితురాలి భర్త, తనకొక దారిని చూపించిన విష్ణువర్ధన్ గారితో, కాస్త నవ్వుతూ చనువుగా మాట్లాడినందులకింత శిక్ష! 'నీది పసిపాపలాటి మనస్తత్వమే పావనీ, ఒంటరిగా ఏ ఇంట్లో వుంటావు. మీ నాన్న, చెల్లి వచ్చింతరవాత, వేరే యిల్లు చూసుకుని వెళ్దువుగానిలే' అంటూ ఆత్మీయంగా మాట్లాడే విమల వెన్నలాటి హృదయం, తనని అనుమానించిందంటే, నరకం ఎక్కడో లేదనిపించింది. అనవసరంగా సృష్టించబడిన, ఈ దుష్ప్రచారాలతో, తన జీవితమే నాశనం అయింది. ఎవరితో మాట్లాడినా ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణ....తను భరించలేక నిర్లిప్తంగా తన మానాన తను మౌనంగా వుంటే, 'అబ్బో! పతివ్రత, నంగనాచి ఇంట్లో కూడా ఎవరికీ చెప్పకుండా పారిపోయి వచ్చిందట. మరి అక్కడేం భాగోతం జరిగిందో!'....అనే నీచమైన ఊహాగానాలు. పోనీ, తన బ్రతుకు ఇలా బుగ్గి అయిపోయిందనుకుంటే, తన బంగారు చెల్లి జీవితం, అక్క మగరాయుడిలా ఉద్యోగం చేస్తూందనీ చెడిపోయినదని, చెల్లికి వచ్చిన సంబంధాలన్నీ తప్పిపోయాయట. ఆఖరికి గుమాస్తా ఉద్యోగం చేస్తూ, మొదటి భార్య చనిపోయి, ఇద్దరు పిల్లలున్న వ్యక్తికి, చెల్లి పార్వతినిచ్చి, ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బంతా, కట్నరూపంగా ఇచ్చి మరీ వివాహం జరిపించి, నాన్నగారు యాత్రలకు వెళ్ళిపోయారని మాష్టారు బాధపడ్తూ జాబు వ్రాశారు.

ఒకసారి చెల్లిని చూడాలని, ఐదు రోజులు సెలవుపెట్టి, దానికీ, దాని భర్తకీ కానుకలు తీసుకుని, సంతోషంగా వెళ్ళిన తనకి ఘోరాతిఘోరమైన అవమానం, చెల్లి ఒళ్ళు హూనం అయ్యేలా దెబ్బలు, భరించలేని అసహ్యకరమైన అపనిందలు! ఐదేళ్ళ క్రిందట బంగారు కడ్డీలా, ఛంగుఛంగున లేడిలా గంతులేసే చెల్లి....తనకి జ్ఞాపకం.

[41వ పేజీ చూడండి]

## ఇదొక చిన్న ప్రశ్న:

### "స్త్రీలు-నగలు, చీరెలూ అంటే ఎందుకని అమితంగా ఇష్టపడతారు?"

ఈ ప్రశ్నకు సమాధానం రాసి పంపిన వారికి "చిన్న బహుమతి" పంపబడుతుంది. సమాధానం కార్డు మీదనే రాయాలి. అదీ—పది మాటలకు మించకుండా, ఒకే వాక్యంలో వుండాలి. సమాధానం వ్యంగ్యంగా, చమత్కారంగానైనా వుండవచ్చును; సవ్యంగానైనా వుండవచ్చును. అన్నింటికన్నా ఎవరి సమాధానం బాగుందని అనిపిస్తే, వారికే బహుమతి పంపబడుతుంది. కార్డుమీద 'చిన్న ప్రశ్న' అని రాసి, 'వనిత' చిరునామాకు ఈ నెలాఖరులోగా అందేలా పోస్ట్ చెయ్యాలి.

**సమాధానం: మార్చి 15 వ తేదీ సంచికలో**

## పిట్ట కథ

జనవరి 15వ తేదీ 'వనిత'లో ఇచ్చిన 'చిన్న పరీక్ష'కు వచ్చిన జవాబుల్లో—సందర్భోచితంగా, సమయస్ఫూర్తిగా వున్న భావన కలిగించిన జవాబు:

"రాజుగారు, రాణీగారూ కలిసి ఆలోచించి, ఆలోచించి – 'ఈ ఆలోచనలన్నీ కుదరవు. ఏం చేస్తాం! పిట్ట లేకపోతే పోయిందిలే కొంపేమీ మునిగిపోదు!' అన్న నిర్ణయానికి వచ్చారు."

ఇది పంపినవారు:


**కె. ఇందిర, హెచ్. నెం. 73/బి, సంతోష్ నగర్ కాలనీ, సైదాబాదు, హైద్రాబాదు 600 659**

ప్రచురించినట్టుగా, ఇస్తామన్న "చిన్న బహుమతి"ని-వారికి పంపుతున్నాము.

[ఓడిపోయాను : 37 వ పేజీ నుంచి]

కానీ, ఇప్పుడో నలభై ఏళ్ళ వ్యక్తికి భార్య. ఇద్దరు పిల్లలకు తల్లి. పీక్కుపోయిన బుగ్గలు, కళ్ళక్రింద నల్లని వలయాలు, ఎముకల ప్రోగులా ఉన్న ఆకారం, పలచబడిన జుత్తు....అసలు, ఆ కుడి బుగ్గమీద ఉన్న శనగగింజంత పుట్టు మచ్చ లేకుంటే, తన చెల్లిని గుర్తుపట్టలేక పోయేది. ఇరవై ఏళ్ళు కూడా లేని చెల్లి స్వరూపం తనని చూడగానే, ఆ లోతు కళ్ళల్లో ఎంత ఆనందం! పసిపిల్లలా, తనని పట్టుకుని ఏడ్చేసింది. కాని ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. అప్పుడే వచ్చాడు దాని భర్త. అనుమానంగా, అసహనంగా, తినేసేలా భయంకరంగా వున్నాయి. అతని చూపులు.... 'ఓహో ! ఎన్నాళ్ళనుండి ఈ రాకపోకలు, ఏం-చెల్లి సుఖంగా పవిత్రంగా సంసారం చేసుకుంటుంటే, కళ్ళుకుట్టి చూద్దానికి వచ్చావా ! సాంప్రదాయమైన మా వంశాన్ని, ప్రతిష్ఠనూ వీధిలోకీడ్చాలని వచ్చావా ?' అంటూ ఎన్నెన్ని మాటలు! తను ఆవేశంగా ఏదో అనబోతుండగా....చెల్లి, స్వయాన తన చిన్నారి చెల్లి, 'అక్కా-నీ చెల్లి చచ్చిపోయిందనుకో. నీవు మాత్రం ఎప్పుడూ ఇక్కడికి రావద్దు' అని చెప్పింది దాని కంఠం !

'నాన్నా....నామీద కసితో, చెల్లిని ఆ కసాయి వాడి చేతులలో పెట్టడానికి నీ మనసెలా అంగీకరించింది? ఆ పెళ్ళి చేసేబదులు ఇంత విషం ఇచ్చి చంపినా చెల్లికిన్ని కష్టాలు వుండకపోవును' కనుపించని తండ్రిని పిచ్చిగా ప్రశ్నించింది పావని. అయిపోయింది. పూర్తిగా ఓడిపోయింది తను! తనేమనుకుంది? హాయిగా ఉద్యోగం చేస్తూ నాన్ననీ, చెల్లినీ అపురూపంగా చూచుకోవాలనీ నాన్నకిష్టమైన ఆ యింటిని దక్కించుకోవాలని చేసిన ప్రయత్నం, తన జీవితాన్నే కాకుండా తన కుటుంబాన్నే నాశనం చేసింది. చెల్లి దగ్గర నుండి వచ్చిన తను, టైఫాయిడ్ జ్వరానికి లోను కావడం ఆ బాధాకరమైన, భయంకరమైన రోజుల్లోనే ఎవరూలేని తనకు, మేమున్నామంటూ పొరుగునే వున్న పల్లవి తల్లిదండ్రులు తనని ఆదుకోవడం, ఆత్మీయులు లేని తన జీవితానికి, అమ్మా నాన్నల ఆప్యాయతను, అన్నా వదినల ఆత్మీయతను అందించిన ఆ దంపతులను తను ఎలా మర్చిపోగలదు. తనని ఆదుకుంటున్న వారి ఆప్యాయతని చూసి, ఇదే సంఘం—విష్ణువర్ధన్ ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోయారుగా, ఇప్పుడు రఘురాం గారిని పట్టిందన్న ప్రచారాలు. కానీ, పల్లవి తల్లి, ఈ ప్రచారాలు నమ్మేటంత కుసంస్కారి కాదు. అందరూ తన స్నేహితురాలు విమల లాటి వాళ్ళే వుంటే....ఇలాటి ప్రమాదకరమైన వ్యక్తుల వలన ఎన్ని కుటుంబాలు సర్వనాశనం అయ్యేవో. అయినా, కుళ్ళు సంఘం పుట్టించే పుకార్లకు తను జడిసి, మునుపటిలా బాధపడటం లేదు. ఆనాడు చెల్లి సంసారం, దాని దయనీయమైన స్థితి చూసిన నాడే తన గుండె, మనసు ఒక శిలలా అయిపోయింది. అనవసరంగా సృష్టించబడిన ఈ దుష్ప్రచారాలు విని, విని తన మనసు, శరీరమూ తూట్లుపడ్డాయి. తనకే ఆపద, కష్టమొచ్చినా మేమున్నామంటూ, తన్నాదుకుంటున్న పల్లవి



బియ్యం కడగడానికి ఉపయోగించిన కడుగు నీటిని విడిగా ఒక పెద్ద పాత్రలో పోసి ఉంచుకుని-అందులో శుభ్రం చెయ్యవలసిన చిన్నచిన్న పాత్రలను కాసేపు వేసి ఉంచి బయటికి తీసి కడిగితే — ఆ పాత్రలు (ముఖ్యంగా స్టీలు, పాత్రలూ, గాజు ఫ్లాస్కులూ) విగవిగ లాడుతూ ఉంటాయి. తెలుసా !

కుటుంబాన్ని తనాదుకోవాలి. రఘురాం అన్నయ్య విషయం కనుక్కోవాలి. పల్లవి పెళ్ళి తనే చేస్తుంది. నిర్ణయం తీసుకున్న పావని హృదయం—జీవితంలో ఎన్నడూ ఎరగనంత నిశ్చింత అనుభవించింది.

*

"ఇప్పుడు చెప్పు పల్లవీ ! నీ మేడమ్‌లాటి జీవితం నీకూ కావాలంటావా ! పల్లవీ! నేనొక వైపు పూర్తిగా విజయం సాధించాను. కానీ, మరోవైపు పూర్తిగా, ఘోరాతి ఘోరంగా ఓడిపోయానమ్మా ! నేననుకున్నదేంటి? జరిగిందేంటి? ఒక స్త్రీ స్వంత కాళ్ళపై నిలిచి, సంపాదించుకుని, ఒంటరిగా జీవిస్తుంటే, ఎందుకింత చులకన ఈ సంఘానికి? నా మనస్తత్వం పూర్తిగా ఎరిగి, కేవలం ఎవరో నీచులు పుట్టించిన కారుకూతలను నమ్మి, ఏ ఆధారాలు లేకపోయినా కేవలం అనుమానంతో నన్ను అవమానాలకు గురిచేసిన విమల, ఇలా నీలాపనిందలతో, నా జీవితాన్నే కాక, నా కుటుంబాన్నంతా చిన్నాభిన్నం చేసినందువల్ల, ఆమెకి జరిగిందేమిటి? దేవుడిచ్చిన అందమే నాకు శత్రువయిందా ! తన బాధలు ఎవరికి చెప్పుకోకుండా, పైకి బింకంగా వుండే నాకు, 'అందగత్తెని గర్వం, పొగరు మిడిసిపాటు' అన్న బిరుదులిచ్చి సత్కరించింది సంఘం. ఎన్ని అపనిందలైనా భరించాను. కానీ...కానీ....నాన్న, నా మీద అనవసరంగా కినుక వహించి, ఏదీ ఆలోచించకుండానే, చెల్లి జీవితాన్ని బండలు చేశారు నాన్న! అన్నివైపుల నుండీ పూర్తిగా ఓడిపోయింది నీ మేడమ్." భారమైన కంఠంతో, తనకు తనే చెప్పుకుంటున్నట్టుగా, స్వగతంలా తన జీవితాన్ని విప్పి చెపుతున్న పావనిని చూస్తున్న పల్లవి, 'పరమసాధ్వి, పరమ పావని, పవిత్రత, తేజస్సు వున్న మేడమ్‌పై, అనవసరంగా పుట్టిన పుకార్లను ఎలా నమ్మిందీ పాపిష్ఠి లోకం' అర్థం కాలేదు పదిహేడేళ్ళ ముగ్ధ పల్లవికి.

*

"మేడమ్ ! నాకు ఉద్యోగం చూడరూ, నాకు పెళ్ళి వద్దు. అయినా కిప్పుడే పెళ్ళేంటండీ" బేలగా ఏడ్చిన పల్లవి, భర్తతోపాటు తనకు నమస్కరిస్తున్న పల్లవి కళ్ళల్లోని మెరుపు, సంతోషం అంతకు మించి, కృతజ్ఞతని చూసిన పావని తృప్తిగా మనసారా ఆ నవదంపతులను ఆశీర్వదించింది.

"మేడమ్ ! పల్లవికి ప్రియమైన మీరు, నాకూ అత్యంత ప్రియమైన ఆత్మీయులే !.... మీరు నన్ను అపార్థం చేసుకోనంటే, నాదొక మనవి. నాకు కొద్దిగా టైమ్ ఇస్తే, మీరిచ్చిన డబ్బు, మీ కిచ్చి వేస్తాను." ప్రాధేయపడుతున్న పల్లవి భర్త రాజీవ్‌ని వారిస్తూ, 'వద్దు...వద్దొద్దు, బాబూ ! నేను కట్నంగా భావించి ఏమీ ఇవ్వలేదా డబ్బు. నా సంతోషం కొద్దీ ఇచ్చింది. నీకంతగా ఇవ్వాలని వుంటే, పల్లవి పేరట బ్యాంక్‌లో వేయి. అంతేగానీ, ఆ డబ్బు తిరిగి ఇచ్చి, నన్ను పరాయిదాన్ని చేయకండి. పల్లవి నా చెల్లె అయితే, ఈ మాత్రం చేయనా...."అని మాట్లాడ్తున్న పావని కంఠం, చేదు జ్ఞాపకాలతో భారమయింది.

*